## తిలక్‌వర్మ @ 2

• ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్



దుబాయ్: ఇటీవలి కాలంలో పొట్టి ఫార్మాట్‌లో నిలకడగా రాణిస్తున్న టీమ్‌ఇండియా యువ సంచలనాలు తిలక్ వర్మ, వరుణ్ చక్రవర్తి.. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 ర్యాంకింగ్స్‌లో దుమ్మురేపారు. బ్యాటర్ల జాబితాలో తిలక్ వర్మ.. ఒక ర్యాంక్ మెరుగుపరుచుకుని రెండో ర్యాంక్‌కు చేరగా వరుణ్.. ఏకంగా 25 ర్యాంక్‌లు ఎగబాకి ఐదో ర్యాంక్‌తో టాప్-5లో చోటు సంపాదించాడు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో వరుస సెంచరీలతో జోరుమీదున్న తిలక్.. ఇంగ్లండ్ సిరీస్‌లోనూ రాణిస్తున్నాడు. చెన్నై మ్యాచ్‌లో ఒత్తిడిలోనూ 72 పరుగులతో రాణించడంతో అతడి ర్యాంకింగ్ మెరుగైంది. ఈ జాబితాలో ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ (855 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతుండగా తిలక్ (832) రెండో ర్యాంక్‌లో ఉన్నాడు.వరుణ్.. ర్యాంకింగ్స్‌లో భారీగా మెరుగయ్యాడు. 679 పాయింట్లతో అతడు ఐదో స్థానంలో నిలవగా రషీద్ టాప్‌ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.

## సిరాజ్, మహీరా డేటింగ్!



ముంబై: టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ మహమ్మద్ సిరాజ్, ప్రముఖ నటి మహీరా శర్మతో డేటింగ్‌లో ఉన్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. బిగ్‌బాస్-13తో ఫేమస్ అయిన మహీరాతో సిరాజ్ గత కొద్ది రోజులుగా ప్రేమాయణం సాగిస్తున్నట్లు తెలుస్తున్నది. గతేడాది నవంబర్‌లో మహీరా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌ను లైక్ చేయడం, ఆ తర్వాత ఒకరినొకరు ఫాలో కావడం దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నది. వీరిద్దరు ప్రస్తుతం డేటింగ్‌లో ఉన్నారని, ఇద్దరి మధ్య సంబంధాన్ని రహస్యంగా కొనసాగిస్తున్నారని ఒక ఇంగ్లీష్ వార్తాసంస్థ తమ కథనంలో పేర్కొంది. ఇటీవలే ఆశా భోంస్లే మనువరాలు జైనై భోంస్లేతో సిరాజ్ సన్నిహితంగా మెలిగిన ఫొటోలు వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే.

# రంజీ రేసు రసవత్తరం

**12 ఏండ్ల తర్వాత దేశవాళీ ఆడనున్న కోహ్లీ • కేఎల్ రాహుల్, సిరాజ్, కుల్‌దీప్ అదే బాట • నేటి నుంచే ఆఖరి లీగ్ మ్యాచ్‌లు**



ఢిల్లీ: దేశవాళీలో ప్రతిష్ఠాత్మకమైన రంజీ ట్రోఫీ తాజా సీజన్ (2024-25) ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా ఆసక్తిని సంతరించుకుంది. బీసీసీఐ ఆదేశాల పుణ్యమా అని జాతీయ జట్టుకు ఆడే స్టార్ క్రికెటర్లు తమ రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో రంజీ మ్యాచ్‌లను చూసేందుకు క్రికెట్ అభిమానులు ఆకర్షితులవుతున్నారు. దాదాపు పుష్కర కాలం తర్వాత పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ.. తన రాష్ట్ర జట్టు (ఢిల్లీ)కు ఆడనుండటం అభిమానుల ఆకర్షణను అమాంతం పెంచగా కర్నాటక బ్యాటర్ కేఎల్ రాహుల్, హైదరాబాదీ పేసర్ సిరాజ్, చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్, స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తమ రాష్ట్ర జట్ల తరపున బరిలోకి దిగనున్నారు. అదీగాక ఈ సీజన్‌లో ఇవే ఆఖరి లీగ్ దశ మ్యాచ్‌లూ కావడం మరో విశేషం. నాలుగు గ్రూపుల నుంచి క్వార్టర్స్ చేరే టాప్-2 జట్లు ఏవై ఉంటాయి? అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

### ముంబైకి అవకాశముందా?

గ్రూపుల వారీగా చూస్తే గ్రూప్-ఏలో జమ్ముకశ్మీర్.. 29 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా డిఫెండింగ్ చాంపియన్‌గా ఉన్న ముంబై.. మూడో స్థానం (22 పాయింట్లు)లో ఉన్న తరుణంలో రహానే సేన క్వార్టర్స్ చేరుతుందా? లేదా? అనేది ఆసక్తిగా మారింది. బరోడాతో జరుగబోయే మ్యాచ్‌ను జమ్ముకశ్మీర్ డ్రా చేసుకున్నా ఆ జట్టు ముందంజ వేస్తుంది. కానీ రెండో స్థానంలో బరోడా (27 పాయింట్లు).. మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించినా, మ్యాచ్ గెలిచినా ముంబై కథ ముగిసినట్టే! గత మ్యాచ్‌లో జమ్ముకశ్మీర్ చేతిలో అనూహ్య ఓటమిని ఎదుర్కొన్న ముంబై.. మేఘాలయాతో భారీ తేడాతో గెలిచి బోనస్ పాయింట్ సాధించడంతో పాటు బరోడా ఓడిపోతేనే డిఫెండింగ్ చాంపియన్‌కు క్వార్టర్స్‌కు వెళ్లే అవకాశముంటుంది.

### కర్నాటకకు చావో రేవో!

గ్రూప్-సీలో హర్యానా (26) అగ్రస్థానంలో ఉండగా రెండో స్థానం కోసం కేరళ (21), కర్నాటక (19) పోటీలో ఉన్నాయి. చివరి లీగ్ మ్యాచ్‌లో కర్నాటక.. హర్యానాతో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో మయాంక్ అగర్వాల్ సేన గెలిచినా.. బీహార్‌తో ఆడబోయే మ్యాచ్‌లో కేరళ విజయం సాధిస్తే కర్నాటకకు క్వార్టర్స్ కష్టమే అవుతుంది. గత మ్యాచ్‌లో పంజాబ్‌పై భారీ విజయం, కేఎల్ రాహుల్ రాకతో ఆ జట్టు కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది.

### గుజరాత్ X హిమాచల్

గ్రూప్-బీలో విదర్భ.. 34 పాయింట్లతో క్వార్టర్స్ బెర్తును ఖాయం చేసుకోగా గుజరాత్ (25), హిమాచల్ ప్రదేశ్ (21) మధ్య ఆసక్తికర పోరు సాగుతోంది. గురువారం నుంచి ఈ రెండు జట్ల మధ్యే మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో విజేత.. తదుపరి దశకు అర్హత సాధిస్తుంది. ఇదే గ్రూపులో ఉన్న హైదరాబాద్.. 16 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఆ జట్టు విదర్భతో నాగ్‌పూర్‌లో చివరి మ్యాచ్ ఆడనుంది.

### గ్రూప్-ఏ నుంచి ఎవరో!

గత మ్యాచ్‌లో చండీగఢ్‌ను ఓడించి 25 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న తమిళనాడు.. తమ తర్వాతి మ్యాచ్‌లో జార్ఖండ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా ఆ జట్టు క్వార్టర్స్ చేరుతుంది. కానీ ఓడితే మాత్రం.. చండీగఢ్ (19), సౌరాష్ట్ర (18) జట్లు తమిళనాడుకు పోటీనివ్వొచ్చు. మరోవైపు చండీగఢ్ ఛత్తీస్‌గఢ్‌తో జరుగబోయే మ్యాచ్‌లో భారీ తేడాతో గెలవాల్సి ఉంది. సౌరాష్ట్ర సైతం అసోంపై భారీ విజయం సాధిస్తే ఈ గ్రూప్‌లో రేసు మరింత రసవత్తరమవుతుంది. గత మ్యాచ్‌లో ఢిల్లీని ఓడించడంలో కీలక పాత్ర పోషించిన రవీంద్ర జడేజా.. అసోంతో మ్యాచ్‌లోనూ మెరవాలని ఆ జట్టు ఆశిస్తోంది.





### అందరి చూపు కోహ్లీ వైపే..

గ్రూప్-ఏలో క్వార్టర్స్ బెర్తు కోసం రసవత్తర పోరు జరుగుతున్నా అందరి కండ్లు రేసులో లేని ఢిల్లీ, రైల్వేస్ మ్యాచ్ వైపే ఉన్నాయి. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరుగబోయే ఈ మ్యాచ్‌లో ఢిల్లీ తరపున కోహ్లీ బరిలోకి దిగనున్నాడు. పుష్కర కాలం తర్వాత దేశవాళీలో పునరాగమనం చేస్తున్న కోహ్లీ ఆటను చూసేందుకు స్టేడియానికి అభిమానులు పోటెత్తే అవకాశముంది. ముందు ఈ మ్యాచ్‌కు ప్రత్యక్ష ప్రసారాలు లేవని చెప్పిన బీసీసీఐ.. కోహ్లీ అభిమానుల ఒత్తిడితో జియో సినిమాలో లైవ్‌ను అందించేందుకు సిద్ధమైంది. కొంతకాలంగా కోహ్లీ ఆటతీరుపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టడంతో పాటు తోడు చాంపియన్స్ ట్రోఫీకి ముందు తన ఆటలోని బలహీనతలను సరిదిద్దుకునేందుకు కోహ్లీకి ఇది చక్కటి అవకాశం. మరి విరాట్ ఏం చేసేనో!

## 'తెలంగాణ ఖ్యాతిని చాటావు'

**క్రికెటర్ గొంగడి త్రిషకు కేటీఆర్ అభినందన**

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): 'దేశ గౌరవాన్ని పెంచావు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ దేశాల్లో మార్మోగేలా చేశావు' అని క్రికెటర్ గొంగడి త్రిషను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. అండర్ 19 టీ20 మహిళల ప్రపంచకప్‌లో సెంచరీ సాధించిన తొలి బ్యాటర్‌గా త్రిశ రికార్డ్ సాధించి ఎంతోమంది మహిళలకు, మహిళా క్రికెటర్లకు ఆదర్శంగా నిలిచిన మీకు మన స్ఫూర్తిగా అభినందనలు అంటూ ఆయన ట్వీట్ చేశారు. మరికొన్నాళ్లలో టీమ్‌ఇండియా మహిళా క్రికెట్‌లో అడుగుపెట్టాలని, భారత కెప్టెన్‌గా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.



ప్రపంచ స్థాయిలో త్రిష సత్తాచాటడం మనందరికీ గర్వకారణమని ప్రశంసిస్తూ ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు.

## మిథాలీ అడుగుజాడల్లో..

**ఈ శతకం నాన్నకు అంకితమన్న త్రిష**



కౌలాలంపూర్: ప్రతిష్ఠాత్మక మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో అదరగొడుతున్న తెలంగాణ యువ క్రికెటర్ గొంగడి త్రిష తన ఆరాధ్య ప్లేయర్ మిథాలీరాజ్ అడుగుజాడల్లో నడుస్తున్నానని పేర్కొంది. మంగళవారం స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ కొట్టిన త్రిష ఈ రికార్డు సాధించిన తొలి బ్యాటర్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో త్రిష మాట్లాడుతూ 'భారత మాజీ కెప్టెన్ మిథాలీరాజ్‌ను చూస్తూ పెరిగాను. ఇన్నింగ్స్ ఎలా నిర్మించాలో ఆమె నుంచి నేర్చుకున్నాను. మిథాలీ ఎప్పటికీ ఆరాధ్య ప్లేయర్. స్కాట్లాండ్‌పై సెంచరీ చాలా ప్రత్యేకం. వాస్తవానికి ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్‌లో సెంచరీ చేయాలనుకున్నాను. కానీ సాధ్యపడలేదు. తొలుత బ్యాటింగ్ చేయడం కలిసొచ్చింది. సహచరులు సంబరాలు చేసే వరకు తెలియదు సెంచరీ మార్క్ చేరుకున్నానని. ఈ స్థాయికి చేరుకోవడానికి నా తల్లిదండ్రులు కారణం. ముఖ్యంగా నా వెన్నంటి ఉండే నాన్నకు ఈ సెంచరీ అంకితమిస్తున్నాను'అని త్రిష పేర్కొంది

## పదివేల క్లబ్‌లో స్మిత్

• తొలిరోజే లంకపై ఆసీస్ భారీ స్కోరు



గాలె: ఆధునిక క్రికెట్‌లో 'ఫాబ్-4' జాబితాలో ఒకడిగా ఉన్న ఆస్ట్రేలియా దిగ్గజ బ్యాటర్ స్టీవ్ స్మిత్ టెస్టులలో పదివేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. శ్రీలంకతో గాలె వేదికగా బుధవారం మొదలైన తొలి టెస్టులో భాగంగా వ్యక్తిగత స్కోరు ఒక్క పరుగు పూర్తిచేయగానే స్మిత్.. ఈ ఘనత సొంతం చేసుకున్నాడు. పదివేల పరుగుల రికార్డుతో పాటు ఈ మ్యాచ్‌లో స్మిత్ (104 నాటౌట్), ఉస్మాన్ ఖవాజా (147 నాటౌట్) శతకాలతో కదం తొక్కడంతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 2 వికెట్ల నష్టానికి 330 పరుగులు చేసింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (57) వన్డే తరహా ఆట ఆడాడు. టెస్టు కెరీర్‌లో 35వ శతకాన్ని పూర్తి చేసిన స్మిత్.. పదివేల పరుగుల ఘనతను అందుకున్న క్రికెటర్లలో 15వ వ్యక్తి. ఆస్ట్రేలియా క్రికెటర్లలో రికీ పాంటింగ్, అలెన్ బోర్డర్, స్టీవ్ వా తర్వాత నాలుగో బ్యాటర్‌గా నిలిచాడు. 205 ఇన్నింగ్స్‌లలో స్మిత్ ఈ రికార్డు అందుకున్నాడు. ఈ క్రమంలో టెస్టులలో వేగంగా 10వేల పరుగుల రికార్డును చేరుకున్న క్రికెటర్లలో లారా, సచిన్, సంగక్కర (ఈ ముగ్గురూ 195 ఇన్నింగ్స్‌లలో), పాంటింగ్ (196) తర్వాత స్మిత్ ఐదో స్థానంలో ఉన్నాడు.

